క్లుప్తంగా

విద్యార్థులకు షూ అందజేత



ధర్మసాగర్ : మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలలో 1971 సంవత్సరంలో 10వ తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులు ప్రస్తుతం చదువుకుంటున్న విద్యార్థులకు షూ అందించారు. విద్యార్థులు చదువుపై ఏకాగ్రత వహించి మంచి మార్కులు సాధించాలని ఈ సందర్భంగా కోరారు. ప్రధానోపాధ్యాయుడు ధర్మప్రకాశ్ వారికి కృతజ్ఞతలు తెలిపారు. ఉపాధ్యాయులు కవిత, పద్మజ, రాజమ్మ, కృష్ణ, ప్రసన్న, పూర్వవిద్యార్థులు కృష్ణమూర్తి, కేదారి, రాధాకృష్ణమూర్తి, జనార్దన్ పాల్గొన్నారు.

శతాధిక వృద్ధురాలి మృతి



మల్లమ్మ (ఫైల్)

ఐనవోలు : మండలంలోని ఒంటి మామిడిపల్లి గ్రామానికి చెందిన ఎర్ర మల్లమ్మ (108) అనారోగ్యంతో శనివారం కన్నుమూశారు. మృతురాలికి ఒక కుమారుడు, ఒక కూతురు ఉండగా వారు గతంలోనే మృతి చెందారు. మల్లమ్మ వార్డు సభ్యురాలిగా, ఐనవోలు మల్లికార్జునస్వామి ఆలయ ధర్మకర్తగా సేవలందించారు.

నేడు టీపీటీఎఫ్ కౌన్సిల్ సమావేశం

విద్యారణ్యపురి: తెలంగాణ ప్రోగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్ (టీపీటీఎఫ్) వరంగల్ జిల్లా కౌన్సిల్ సమావేశాన్ని రంగశాయిపేటలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ఈనెల 17న ఉదయం నిర్వహించనున్నట్లు టీపీటీఎఫ్ వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి పూజారి మనోజ్‌కుమార్ గౌడ్ శనివారం తెలిపారు. ముఖ్యఅతిథిగా టీపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కడారి భోగేశ్వర్, ఎన్నికల అధికారిగా టీపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్.కవిత పాల్గొంటారని తెలిపారు. టీపీటీఎఫ్ వరంగల్ జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్వర్లు అధ్యక్షతన జరగనున్న సమావేశంలో జిల్లా కమిటీని ఎన్నుకోనున్నట్లు పేర్కొన్నారు.

ఆర్థిక సాయం అందజేత

మడికొండ: మడికొండలోని వినాయకనగర్‌కు చెందిన నార్లగిరి వనజ ఇల్లు శుక్రవారం ప్రమాదవశాత్తు విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో దగ్ధమైంది. ఈమేరకు బాధిత కుటుంబ సభ్యులకు గ్రామానికి చెందిన ఎస్సీ, బీసీ కాలనీ అభివృద్ధి కమిటీ సభ్యులు రూ.5 వేల ఆర్థిక సాయాన్ని శనివారం అందజేశారు. కమిటీ సభ్యులు కాశేశ్వరపు సునీత, జానపట్ల అనసూర్య, జిట్ట రమ, కాగితాల ప్రవళిక, చెనమల్ల రేణుక, కాశి రజిత, కాగితం సౌందర్య పాల్గొన్నారు.

అణగారిన వర్గాలకు ప్రభుత్వం న్యాయం చేయాలి

నయీంనగర్: అణగారిన వర్గాలకు ఉచిత విద్య, వైద్యం, ఇల్లు, భూమి, ఉపాధి ప్రభుత్వమే కల్పించాలని ధర్మ సమాజ్ పార్టీ హనుమకొండ జిల్లా శాఖ అధ్యక్షుడు మంద రమేశ్ డిమాండ్ చేశారు. హనుమకొండ ప్రెస్ క్లబ్‌లో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఎన్నికల హామీలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ధర్మ సమాజ్ పార్టీ పోరాటం చేస్తోందని అన్నారు. అణగారిన వర్గాలకు న్యాయం జరిగే వరకు పార్టీ వివిధ రూపాల్లో పోరాటం చేస్తుందని వివరించారు. రత్నాకర్, రవి, యేసోబు, జయపాల్, నరేష్ పాల్గొన్నారు.

వ్యాసరచన పోస్టర్ల ఆవిష్కరణ

వరంగల్ లీగల్: రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకుని టీపీసీసీ చైర్మన్ పొన్నం అశోక్ గౌడ్ ఆధ్వర్యంలో ప్రజాస్వామ్యాన్ని కాపాడేందుకు, రాజ్యాంగ ప్రాముఖ్యత అనే అంశంపై రాష్ట్రస్థాయి వ్యాసరచన పోటీలు నిర్వహించనున్నట్లు కాంగ్రెస్ పార్టీ లీగల్‌సెల్ చైర్మన్ శామంతుల శ్రీనివాస్ తెలిపారు. ఈమేరకు ఆసక్తి గల న్యాయవాదులు పాల్గొనాలని కోరుతూ వరంగల్ కోర్టు ప్రాంగణంలో వ్యాసరచన పోటీల కరపత్రాలను శనివారం ఆవిష్కరించారు. టీపీసీసీ రాష్ట్ర వైస్ చైర్మన్ ముదసిర్ అహ్మద్, క్యాయిమ్ పాల్గొన్నారు.

ఓపెన్ స్కూల్ కోఆర్డినేటర్ సదానందానికి సన్మానం

హన్మకొండ: ఇటీవల బాధ్యతలు చేపట్టిన ఓపెన్ స్కూల్ ఉమ్మడి వరంగల్ జిల్లా కోఆర్డినేటర్ అనగాని సదానందం గౌడ్‌ను బీసీ సంక్షేమ సంఘం నాయకులు సన్మానించారు. హనుమకొండ నయీంనగర్‌లో శనివారం జరిగిన కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు వడ్లకొండ వేణుగోపాల్ గౌడ్ పాల్గొన్నారు.


నేడు సీపీ స్టార్ టాలెంట్ టెస్ట్

కాజీపేట అర్బన్: సీపీ స్టార్ టాలెంట్ టెస్ట్-25ను కోటా రాజస్థాన్ జాతీయ స్థాయి నీట్, ఐఐటీ కోచింగ్ సెంటర్ కెరీర్ పాయింట్ ఆధ్వర్యంలో హంటర్‌రోడ్డు న్యూశాయంపేటలోని వరంగల్ బ్రాంచ్‌లో ఆదివారం ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు నిర్వహించనున్నట్లు వరంగల్ బ్రాంచ్ చైర్మన్ కరుణాకర్‌రావు ప్రకటనలో తెలిపారు.

ఎండిన వృక్షాలతో పొంచిఉన్న ప్రమాదం

- భయాందోళనలో వాహనదారులు
- ఎప్పుడు కూలుతాయో తెలియని పరిస్థితి
- పట్టించుకోని అధికారులు
- చర్యలు తీసుకోవాలని పలువురి డిమాండ్

నడికూడ : రోడ్డుకిరువైపులా పచ్చని చెట్లు ఎంతో ఆహ్లాదాన్ని ఇస్తాయి. కానీ అవి ఎండిపోయి నేల కూలే స్థితికి చేరుకుంటే ప్రయాణికులు భయాందోళన చెందాల్సిందే. పరకాల, అంబాల, హనుమకొండ రహదారిలో ఎండిన చెట్లు ఎప్పుడు నేలకూలుతాయో తెలియని పరిస్థితిలో వాహనదారులు అటువైపు వెళ్లాలంటే జంకుతున్నారు. ఈదురు గాలులు వస్తే ఆ రోడ్డుగుండా వెళ్లాలంటే ఆలోచిస్తున్నారు. నిత్యం ఈ మార్గం గుండా ఉన్నతాధికారులు ప్రయాణిస్తుంటారు కానీ ఎవరూ పట్టించుకోవడం లేదనే విమర్శలు వస్తున్నాయి. భారీ వాహనాలు ఈ రోడ్డుగుండా వెళ్లడంతో చెట్టుకొమ్మలు విరగడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడాల్సి వస్తుందని వాహనదారులు వాపోతున్నారు. ఇటీవల ధర్మారం గ్రామ శివారులో అర్ధరాత్రి భారీ వృక్షం విరిగిపడగా.. ఆ సమయంలో వాహనదారులు అటువైపు వెళ్లకపోవడంతో ప్రమాదం తప్పిందని అంటున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు వెంటనే స్పందించి ఎండిన వృక్షాలను తొలిగించాలని వాహనదారులు కోరుతున్నారు.



పరకాల- అంబాల - హనుమకొండ రహదారిలో ఎండిపోయి ప్రమాదకరంగా ఉన్న చెట్టు

ప్రమాదకరంగా ఉన్నాయి



రోడ్డుకిరువైపులా ఎండిన వృక్షాలు ప్రమాదకరంగా ఉన్నాయి. ఎప్పుడు నేలకూలుతాయో తెలియని పరిస్థితి నెలకొంది. వాటిని తొలిగించి మొక్కలు నాటిలి.

- భాషక రవి, ధర్మారం

ప్రయాణించాలంటే భయమేస్తోంది



పరకాల నుంచి హనుమకొండ వరకు రోడ్డుకిరువైపులా చెట్లు ఎండి ప్రమాదకరంగా ఉన్నాయి. నేను ప్రతిరోజు హనుమకొండలో కాలేజీకి వెళ్తుంటాను. ప్రమాదకరంగా ఉన్న ఈ ఎండిన వృక్షాలను చూస్తే భయమేస్తుంది. ఎప్పుడు నేలకూలుతాయో తెలియని పరిస్థితి ఉంది. రాత్రి సమయంలో ప్రయాణించే వారికి ప్రమాదం జరిగే అవకాశం ఉంది. సంబంధిత అధికారులు స్పందించి వాటిని తొలిగిస్తే బాగుంటుంది. వాటి స్థానంలో మళ్లీ మొక్కలు నాటాలి.

- పెండ్లి ప్రవీణ్, రామకృష్ణపూర్

పోల్ వేసి.. తీగలు సరిచేసి

సాక్షి ఎఫెక్ట్..

ఐనవోలు : విద్యుత్ తీగలను కర్ర సాయంతో నిలబెట్టి ప్రమాదకరంగా కనిపిస్తుండగా సాక్షి పత్రికలో ఈనెల 14వ తేదీన 'ప్రమాదకరంగా విద్యుత్ తీగలు' అనే కథనం ప్రచురితమైంది. ఈ సందర్భంగా విద్యుత్ శాఖ పంథిని ఏఈ జగదీశ్వర్‌రెడ్డి స్పందించారు. శనివారం కక్కిరాలపల్లి చెరువు కట్టపై ఎత్తుగా మిడిల్‌పోల్ ఏర్పాటు చేసి వేలాడే తీగాలను సరిచేశారు. సమస్య పరిష్కారానికి కృషి చేసిన సాక్షికి స్థానికులు కృతజ్ఞతలు తెలిపారు.



మిడిల్‌పోల్ ఏర్పాటు చేసి తీగలను సరిచేస్తున్న సిబ్బంది

మంత్రిని కలిసిన పాలకవర్గ సభ్యులు



కమలాపూర్ : మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్‌తో పాటు పాలకవర్గ సభ్యులు శనివారం రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. తమను మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్, డైరెక్టర్లుగా నియమించినందుకు మంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం మంత్రి ప్రభాకర్‌గౌడ్ మార్కెట్ కమిటీ పాలకవర్గ సభ్యులను శాలువాతో సన్మానించి అభినందించారు. మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ఐలయ్యగౌడ్, డైరెక్టర్లు శివకృష్ణగౌడ్, కృష్ణమూర్తి, శ్రీధర్, కృష్ణ, లింగయ్య, శ్రీనివాస్, భిక్షపతి, అనిల్‌రెడ్డి, తిరుపతి పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ

శాయంపేట : మండలంలోని గోవిందాపూర్ గ్రామానికి చెందిన న్యాతని సదానందం శుక్రవారం రాత్రి మృతిచెందాడు. విషయం తెలుసుకున్న కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు దూదిపాల బుచ్చిరెడ్డి బాధిత కుటుంబాన్ని శనివారం పరామర్శించారు. సదానందం భౌతికకాయానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం మండల కేంద్రానికి చెందిన దైనంపల్లి రవీందర్, పత్తిపాక గ్రామానికి చెందిన బాబు ఐలమ్మలు ఇటీవల మృతి చెందగా పరామర్శించారు.

ఇసుక రవాణాకు అనుమతులు తప్పనిసరి



పోలీస్ స్టేషన్‌కు తరలిస్తున్న ఇసుక ట్రాక్టర్లు

ఐనవోలు : ఇసుక రవాణాకు అనుమతులు తీసుకోవాలని ఎస్సై పస్తం శ్రీనివాస్ సూచించారు. అనుమతులు లేకుండా ఇసుక రవాణా చేస్తున్న ఎనిమిది ఇసుక ట్రాక్టర్లను పట్టుకున్నట్లు తెలిపారు. శనివారం ఉదయం వనమాల కనపర్తి పరిసర ప్రాంతాల్లో తనిఖీలు చేపట్టగా ఆ మార్గం గుండా వరంగల్‌కు అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న ఇసుక ట్రాక్టర్లను పట్టుకున్నామని తెలిపారు. ట్రాక్టర్లను పోలీస్ స్టేషన్‌కు తరలించి డ్రైవర్, ఓనర్లపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఆయన వెల్లడించారు.

ఇంటింటి సర్వేను సమర్థవంతంగా నిర్వహించాలి



శాయంపేట : సర్వేను పర్యవేక్షిస్తున్న ఎంపీఓ



కమలాపూర్‌లో..



నడికూడ : సర్వేను పర్యవేక్షిస్తున్న మురళీధర్‌రెడ్డి

శాయంపేట : రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ఇంటింటి సమగ్ర సర్వేను సమర్థవంతంగా నిర్వహించాలని ఎంపీఓ రంజిత్‌కుమార్ సూచించారు. మండలంలో కొనసాగుతున్న సర్వేను శనివారం ఆయన పర్యవేక్షించారు. ఎన్యుమరేటర్లు ఇంటింటికి వెళ్లి ఎలాంటి పొరపాట్లు లేకుండా కుటుంబ సభ్యుల వివరాలు నమోదు చేయాలని అన్నారు. ప్రతిఒక్కరూ ప్రజలతో మర్యాదపూర్వకంగా వ్యవహరిస్తూ ఓపికతో పనిచేయాలని అన్నారు. పంచాయతీ కార్యదర్శి రత్నాకర్, ఎన్యుమరేటర్ శ్వేత పాల్గొన్నారు.

కమలాపూర్ : సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల సర్వే (సమగ్ర ఇంటింటి సర్వే)లో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలని, ఎన్యుమరేటర్లకు సమాచారం అందించి సహకరించాలని మండల పంచాయతీ అధికారి రవి కోరారు. ఉప్పల్‌లో కొనసాగుతున్న సర్వేను శనివారం పరిశీలించారు. ఎలాంటి పొరపాట్లకు తావివ్వకుండా సర్వేను గడువులోగా పూర్తి చేయాలని ఎన్యుమరేటర్లకు సూచించారు. ఈజీఎస్ ఏపీఓ రమేశ్, సూపర్‌వైజర్లు, ఎన్యుమరేటర్లు పాల్గొన్నారు.

నడికూడ : మండల పరిధిలో 6,143 ఇళ్లలో సమగ్ర ఇంటింటి సర్వే పూర్తైనట్లు మండల ప్రత్యేక అధికారి, జిల్లా మైనారిటీ సంక్షేమ అధికారి మురళీధర్‌రెడ్డి తెలిపారు. శనివారం మండలంలోని చౌటుపర్తి, ముస్త్యాలపల్లి, చర్లపల్లి గ్రామాల్లో కొనసాగుతున్న సర్వేను పర్యవేక్షించారు. మండలంలో మొత్తం 11,474 ఇళ్లు ఉండగా ఇప్పటి వరకు 6,143 ఇళ్లలో సర్వే పూర్తి చేసినట్లు చెప్పారు. 53.54 శాతం పూర్తి చేశామని, మిగతా ఇళ్లు త్వరలోనే పూర్తి చేయనున్నట్లు పేర్కొన్నారు. ఎంపీడీఓ శ్రీనివాస్, ఎంపీఓ చేతన్ కుమార్ రెడ్డి, పంచాయతీ కార్యదర్శులు కరుణ, సాంబశివ రావు, అరుణ్‌కుమార్, ఎన్యుమరేటర్‌లు తదితరులు పాల్గొన్నారు.

పుస్తక పఠనంతో మెరుగైన సమాజం

హన్మకొండ చౌరస్తా: పుస్తక పఠనం ద్వారానే మెరుగైన సమాజ నిర్మాణం జరుగుతుందని, ఈక్రమంలో ప్రతిఒక్కరూ పుస్తక పఠనాన్ని అలవర్చుకోవాలని తెలంగాణ రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ చైర్మన్ మహ్మద్ రియాజ్ సూచించారు. జాతీయ పుస్తక వారోత్సవాల సందర్భంగా హనుమకొండ అశోకా కాంప్లెక్స్‌లో శనివారం ఏర్పాటు చేసిన నవచేతన పుస్తక ప్రదర్శనను శనివారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా నవచేతన పబ్లిషింగ్ హౌజ్ ప్రచురించిన సుంకిరెడ్డి నారాయణరెడ్డి రాసిన తెలంగాణ చరిత్ర, ప్రముఖ న్యాయవాది ఏరుకొండ జయశంకర్ రాసిన చెదిరిన స్వప్నం రాజీవ్ అనే పుస్తకాలను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రముఖుల పుస్తకాలను నవచేతన బుక్‌హౌస్ పాఠకులకు అందుబాటులో ఉంచడం అభినందనీయమని ప్రశంసించారు. బుక్‌హౌస్ మేనేజర్ ఎర్ర నాగరాజు మాట్లాడుతూ ఈనెల చివరి వరకు కొనసాగున్న పుస్తక ప్రదర్శనలో ప్రతీ పుస్తకంపై 10 నుంచి 30శాతం రాయితీ అందిస్తున్నట్లు వివరించారు. కార్యక్రమంలో సీపీఐ హనుమకొండ జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి, వరంగల్ ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు వేముల నాగరాజు, టీయూడబ్ల్యూజే జిల్లా కార్యదర్శి తోట సుధాకర్, బుక్‌హౌస్ సిబ్బంది తాండూరు గోపి, ఆకినపల్లి రమేష్, సూర్యప్రకాష్ పాల్గొన్నారు.



పుస్తకాలను ఆవిష్కరిస్తున్న రియాజ్, తదితరులు

ప్రజాస్వామ్యానికి పట్టుగొమ్మలు పత్రికలు

కేయూ క్యాంపస్: ప్రజాస్వామ్యానికి పట్టుగొమ్మలు పత్రికలు అని కాకతీయ యూనివర్సిటీ జర్నలిజం విభాగం అధిపతి డాక్టర్ సంగని మల్లేశ్వర్ అన్నారు. జాతీయ పత్రికా దినోత్సవం సందర్భంగా కాకతీయ యూనివర్సిటీలోని జర్నలిజం విభాగంలో శనివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. 1956, నవంబర్ 16న ప్రెస్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా ఏర్పడిందని వివరించారు. అప్పటి నుంచి ప్రతీఏడాది నవంబర్ 16ను జాతీయ పత్రిక దినోత్సవంగా జరుపుకొంటున్నట్లు తెలిపారు. సమాజంలోని అన్యాయాలు, అవినీతి, అక్రమాలను వెలికితీసి కథనాలు రాసే బాధ్యత జర్నలిస్టులపై ఉంటుందని గుర్తుచేశారు. పత్రికలు నిజాన్ని నిర్భయంగా, స్వేచ్ఛగా, రాజకీయాలకు అతీతంగా రాయాల్సిన అవసరం ఉందన్నారు. సమావేశంలో జర్నలిజం విభాగం అధ్యాపకులు డాక్టర్ శ్రీకాంత్ యాదవ్, నర్సింహరాములు, డాక్టర్ వంగాల సుధాకర్, డాక్టర్ మోటె చిరంజీవి పాల్గొన్నారు.

జేఎల్‌లకు నియామక పత్రాలివ్వండి

కేయూ క్యాంపస్: ప్రభుత్వ జూనియర్ కళాశాలల లెక్చరర్లుగా ఎంపికైన తమకు నియామక పత్రాలు ఇవ్వలేదని ఉమ్మడి వరంగల్ జూనియర్ లెక్చరర్లు తెలిపారు. ఈమేరకు తమకు నియామక పత్రాలు ఇవ్వాలని మంత్రులు శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్, కొండా సురేఖను కలిసి వినతిపత్రాలు అందజేశారు. అలాగే, సీఎం సలహాదారు వేంనరేందర్‌రెడ్డి, పీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్ గౌడ్‌కు విజ్ఞప్తిచేశారు. కార్యక్రమంలో డాక్టర్ లింగనాయక్, సతీష్, మనోజ్, యాకూబ్‌పాషా, కాంతయ్య, వంశీకృష్ణ, రాజేష్, రమేష్, శ్వేత, శ్రీకాంత్‌చారి, వీరేందర్, తిరుపతిరావు పాల్గొన్నారు.

వ్యాపారి కుటుంబానికి ఆర్థికసాయం అందజేత

వరంగల్: వరంగల్ లక్ష్మీపురం కూరగాయల మార్కెట్‌లోని ఆకుకూరల వ్యాపారి వాసం సదానందం ఇటీవల గుండెపోటుతో మృతి చెందారు. ఈమేరకు బాధిత కుటుంబ సభ్యులను కూరగాయల మార్కెట్‌లోని తెలంగాణ పొదుపు, మార్కెటింగ్ సహకార సంఘం అధ్యక్షుడు బిట్ల కృష్ణ ఆధ్వర్యంలో సభ్యులు శనివారం పరామర్శించి ఆర్థిక సాయం అందించారు. బాధిత కుటుంబానికి అండగా ఉంటామని అన్నారు. ఈ కార్యక్రమంలో సహకార సంఘం బాధ్యులు సామల రాజు, మంద రంజిత్, కొండా హరి, పంచగిరి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

కమలాపూర్ : గంజాయి, డ్రగ్స్ వంటి మత్తు పదార్థాలకు యువత, విద్యార్థులు దూరంగా ఉండాలని ఇన్‌స్పెక్టర్ హరికృష్ణ సూచించారు. మండల కేంద్రంలోని విశ్వభారతి హైస్కూల్‌లో యాంటీ డ్రగ్స్‌పై శనివారం అవగాహన సదస్సు నిర్వహించి మాట్లాడారు. గంజాయి, డ్రగ్స్ వంటి మత్తు పదార్థాలు సేవించి తమ భవిష్యత్‌ను నాశనం చేసుకోవద్దని అన్నారు. వాటిని సేవించడం ద్వారా కలిగే అనర్థాలను విద్యార్థులకు వివరించారు. అనంతరం యాంటీ డ్రగ్స్‌పై నిర్వహించిన వివిధ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందించారు. ఈ క్యాక్రమంలో ఎంఈఓ రాంకిషన్‌రాజు, ప్రిన్సిపాల్ ఇంజపురి మధుబాబు, హెచ్‌ఎం ఇంజపురి రాజ్‌కుమార్, ఉపాధ్యాయులు హరికృష్ణ, ప్రవీణ్, అరుణ, రూప, రాజ్‌కుమార్, ప్రవళిక, విద్యార్థులు పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న ఇన్‌స్పెక్టర్ హరికృష్ణ

కొనుగోలు కేంద్రాల్లోనే మద్దతు ధర



కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న రాజిరెడ్డి

పరకాల : రైతుల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లోనే మద్దతు లభిస్తుందని పరకాల వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ చందుపట్ల రాజిరెడ్డి అన్నారు. మండలంలోని పోచారం, నాగారం, లక్ష్మీపురంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను పీఏసీఎస్ చైర్మన్ రాజేందర్‌రెడ్డితో కలిసి శనివారం ప్రారంభించారు. రైతులు దళారులను ఆశ్రయించి నష్టపోవద్దని అన్నారు. ప్రభుత్వం తరుఫున ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు దేవేందర్‌రెడ్డి, డైరెక్టర్‌లు శ్రీనివాస్, రమేశ్, సునీత, శంకర్, కోలపాక అర్జున్, పోతరాజు సదయ్య, పద్మ పాల్గొన్నారు.

మహిళాహక్కు చట్టాలు అమలు చేయాలి



శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న డాక్టర్ పల్లెపాడు దామోదర్

కమలాపూర్ : మహిళల రక్షణకు ఎన్నో చట్టాలు ఉన్నప్పటికీ వాటి అమలులో జాప్యం కారణంగా ఇబ్బందులు తలెత్తుతున్నాయని, మహిళా హక్కు చట్టాలను సక్రమంగా అమలు చేయాలని సర్వోదయ యూత్ ఆర్గనైజేషన్ కార్యదర్శి డాక్టర్ పల్లెపాడు దామోదర్ అన్నారు. సర్వోదయ యూత్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో శనివారం నిర్వహించిన మహిళా సహాయక కమిటీల శిక్షణ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. మహిళల సమస్యల పరిష్కారం, రక్షణ కోసం అనేక చట్టాలు ఉన్నాయని, వాటిని సక్రమంగా వినియోగించుకుంటే హింసా రహిత సమాజం సాధ్యపడుతుందన్నారు. మహిళలు వారి సమస్యల పరిష్కారం కోసం సహకారం అందించే వ్యవస్థలను ఆశ్రయించాలన్నారు. హింసకు గురికాకుండా ఉండాలంటే మహిళా చట్టాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. సమస్యల పరిష్కారానికి, శిక్షల అమలుకు ఎక్కువ సమయం పడుతున్న కారణంగా కొత్త సమస్యలు ఎదుర్కోవాల్సి వస్తోందన్నారు. మహిళా చట్టాల అమలు, సత్వర న్యాయం మహిళలకు రక్షణగా ఉపయోగపడుతుందన్నారు. అనంతరం ఎస్సై వీరభద్రరావు మాట్లాడుతూ.. గ్రామాల్లో మహిళల సమస్యలపై సహాయక కమిటీలు నిస్వార్థంగా పని చేయడం అభినందనీయమన్నారు. లింగ నిర్ధారణ నివారణ చట్టం అమలుకు అందరు సహకరించాలని డాక్టర్ శివకుమార్ కోరారు. సంస్థ ప్రతినిధులు ఇందిర, అక్తర్, శ్రీలత, కమలాపూర్, కానిపర్తి, శనిగరం, గూడూరు, వంగపల్లి, ఉప్పల్ గ్రామాల మహిళా సహాయక కమిటీల సభ్యులు పాల్గొన్నారు.

భూ ఆక్రమణదారులపై చర్య తీసుకోవాలి

ఐనవోలు : పంథిని గ్రామంలోని ఖమ్మం హైవే రోడ్డు వద్ద వాగుకు సంబంధించిన నాలా, ప్రభుత్వ భూమిని ఆక్రమంచి పట్టా పొందిన వారిపై చర్యలు తీసుకోవాలని పంథిని మాజీ సర్పంచ్ బరిగెల సదానందం కోరారు. ఈ మేరకు గ్రామస్తులతో కలిసి మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో శనివారం డిప్యూటీ తహసీల్దార్ అనిల్‌కుమార్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా సదానందం మాట్లాడుతూ.. అక్రమంగా చేసుకున్న పట్టాను తొలిగించాలని కోరారు. సదరు వ్యక్తిపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని వినతిలో పేర్కొన్నారు. భూమికి సంబంధించిన పోలియో పహాణీలను పరిశీలించాలని విజ్ఞప్తి చేశారు. ముంజ ఎల్లయ్య, ముంజ ఉప్పలయ్య, ముంజ కుమారస్వామి, బిర్రు సతీష్, దాట్ల మహేష్, జన్ను సురేష్, జన్ను ప్రణయ్, శివ ఉన్నారు.



డీటీకి వినతిపత్రం అందజేస్తున్న మాజీ సర్పంచ్ సదానందం, గ్రామస్తులు

మాజీ ఎమ్మెల్యేపై ఆరోపణలు మానుకోవాలి

- మాజీ జెడ్పీటీసీ సరిత

వేలేరు : స్టేషన్ ఘన్‌పూర్ మాజీ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్యపై అధికార కాంగ్రెస్ పార్టీ నాయకులు చేస్తున్న అసత్య ప్రచారాలను, ఆరోపణలు మానుకోవాలని మాజీ జెడ్పీటీసీ చాడ సరిత హితవు పలికారు. మండల కేంద్రంలో శనివారం విలేకరులతో మాట్లాడారు. కొంతమంది కాంగ్రెస్ నాయకులు స్థాయిని మరిచి మాట్లాడుతున్నారని విమర్శించారు. ఎన్నికల సమయంలో ఎమ్మెల్యే కడియం శ్రీహరి ప్రజలకు ఇచ్చిన హామీలను మరిచి కక్షసాధింపు రాజకీయాలు చేస్తున్నారని ఆరోపించారు. టెక్స్‌టైల్ పార్కు పరకాలకు తరలిపోవడం వెనుక కడియం కుట్ర రాజకీయాలే కారణమని విమర్శించారు. కడియంకు దమ్ముంటే బీఆర్ఎస్ పార్టీ ద్వారా వచ్చిన ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. నియోజకవర్గ అభివృద్ధి కోసమే పార్టీ మారానని చెపుతున్న కడియం శ్రీహరి కాంగ్రెస్‌లో చేరి ఇంత వరకు ఒక్క అభివృద్ధి పనికి శంకుస్థాపన చేయలేదన్నారు. మాజీ వైస్‌ఎంపీపీ సంపత్, మాజీ సర్పంచ్ మాధవరెడ్డి, మండల ఇన్‌చార్జ్ భూపతిరాజు, మండల కో ఆర్డినేటర్ సురేష్, నాయకులు జానీ, వీరయ్య, మహేందర్, రాజు, తిరుపతి పాల్గొన్నారు.



వేలేరు : మాట్లాడుతున్న మాజీ జెడ్పీటీసీ సరిత

అనుచిత వ్యాఖ్యలు సరికాదు

ధర్మసాగర్ : మాజీ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్యపై కాంగ్రెస్ పార్టీ నాయకులు అనుచిత వాఖ్యలు చేస్తే సహించేదిలేదని బీఆర్ఎస్ పార్టీ మండల కన్వీనర్ కర్ర సోమిరెడ్డి, నాయకుడు బొడ్డు ప్రభుదాస్ హెచ్చరించారు. మండల కేంద్రంలో శనివారం విలేకరులతో మాట్లాడారు. మండలంలోని దేవునూర్ గ్రామంలో ఇనుపరాతి గుట్ట ప్రాంతాన్ని పర్యాటక కేంద్రంగా ఏర్పాటు చేసి అభివృద్ధి చేస్తే నగర ప్రజలకు అందుబాటులో ఉంటుందని అన్నారు. అయితే ఇనుపరాతి గుట్టలను ఎమ్మెల్యే కడియం శ్రీహరి అనుచరులు, కొందరు రియల్ ఎస్టేట్ వ్యాపారులు ఆక్రమించుకోవాలని చూస్తున్నారని ఆరోపించారు. ఇనుపరాతి గుట్టలను పరిరక్షించాలని మాజీ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య మాట్లాడితే కాంగ్రెస్ నాయకులు జీర్ణించుకోలేక అనుచిత వాఖ్యలు చేస్తున్నారని మండిపడ్డారు. కడియం శ్రీహరి, కాంగ్రెస్ నాయకులు అవివేకంగా మాట్లాడుతున్నారని అన్నారు. నాయకులు కరుణాకర్, జుబేదా లాల్ మహ్మద్, ప్రతాప్, శ్రీనివాస్, రమేశ్, సుదర్శన్, లక్ష్మి పాల్గొన్నారు.

రౌడీ షీటర్లకు కౌన్సెలింగ్

ఖిలా వరంగల్: వరంగల్ మిల్స్‌కాలనీ పోలీస్ స్టేషన్‌లో రౌడీ షీటర్లకు ఇన్‌స్పెక్టర్ వెంకటరత్నం శనివారం కౌన్సెలింగ్ ఇచ్చారు. రౌడీ షీటర్లు ఎలాంటి గొడవలు, చట్ట విరుద్ధమైన వివాదాల్లో తలదూర్చవద్దని హెచ్చరించారు. ఎస్సైలు సురేష్, రవీందర్ ఉన్నారు.